సాక్షి జోగులాంబ గద్వాల

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-35
(మంగళవారం సాయంత్రం)

సహర్ 4-48
(బుధవారం తెల్లవారుజామున)



వాహన తనిఖీలు

ఉమ్మడి జిల్లాలో చేపడుతున్న వాహన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.3/21.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గద్వాల డీఎస్‌ఓ ప్రత్యేక పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారు దత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రేవతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని ధ్యాన మందిరంలో ఏర్పాటు చేయనున్న స్వర్ణాకర్షణ భైరవమూర్తి విగ్రహ ఏర్పాటుకు రూ.1.50 లక్షలు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. పద వీ విరమణ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్టు డీఎస్‌ఓ వెల్లడించారు. డీఎస్‌ఓను ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీచుపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి అభిషేకాలు చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే ఇక్కడికి ఆలయానికి చేరుకొని శివునికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

'నవోదయ' ఫలితాలు విడుదల

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి 5,128 మంది దరఖాస్తు చేసుకోగా.. 80 మంది, 9వ తరగతిలో 1,240 మందికిగాను 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఫలితాల వివరాలను నవోదయ వెబ్‌సైట్‌లో ఉంచడంతో పాటు ఎంపికైన విద్యార్థులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా



గద్వాలలో వివాదాస్పదంగా మారిన మెయిన్‌బజారులోని మున్సిపల్ మాజీ చైర్మన్ విక్రయించిన స్థలం ఇదే..

ఇప్పటికే రూ.కోట్ల విలువైన భూమి ఆక్రమణ

- తాజాగా మరో స్థలం, నిర్మాణంపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఓ మాజీ మున్సిపల్ ప్రజాప్రతినిధి మరొకరికి విక్రయం
- పనులు అడ్డుకున్న మున్సిపల్ అధికారులు.. యజమానికి నోటీసులు

గద్వాల రూరల్: జిల్లాకేంద్రంలో ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాకు గురవుతున్న ఘటనలు కోకొల్లలు. ఇలా రూ.కోట్ల విలువ చేసే స్థలాలు ఆక్రమణకు గురికావడం.. భవంతులు, నిర్మాణాలు చేపట్టడం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది. వెంచర్లు ఏర్పాటు చేసే క్రమంలో పది శాతం స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా.. గద్వాల చాలామటుకు ఈ స్థలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయి. ఇంత జరుగుతున్నా అడిగేవారే లేరా..? అంటే తాజా కబ్జాలను పరిశీలిస్తే లేరనే సమాధానం వినిపిస్తుంది. మరోవైపు కలెక్టర్, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ వంటి అధికారులు ఉన్నప్పటికీ వారు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా తాజాగా గద్వాల పట్టణ నడిబొడ్డులో ఓ మాజీ మున్సిపల్ ప్రజాప్రతినిధి విక్రయించిన స్థలం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆ స్థలంలో షాపు నిర్మాణం చేపడుతుండగా పెద్ద ఎత్తున ప్రజల నుంచి ఫిర్యాదులు రాగా.. మున్సిపల్ అధికారులు సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చి అడ్డుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది.

నిబంధనలు పాతరా..

ఇదిలా ఉంటే ఈస్థలంలో వ్యవహారంలో మరో వాదన కూడా వినిపిస్తుంది. వాస్తవానికి కమర్షియల్ నిర్మాణాలు చేపట్టే క్రమంలో తక్కువ విస్తీర్ణం ఉన్న నిర్మాణాలకు సైతం సెట్‌బ్యాక్ స్థలం వదలాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆ లెక్కన అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులు నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయనే మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



తేర్లవద్ద ఉన్న మెయిన్ బజారులో చేపడుతున్న నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే సదరు వ్యక్తికి వారం రోజులు గడువు ఇస్తూ నోటీసులు ఇచ్చి పనులు ఆపేశాం. కానీ, సదరు వ్యక్తి ఆది, సోమవారం తిరిగి నిర్మాణ పనులు చేపట్టారు. వీటిపై ఇప్పటికే తేదీలు, టైంతో సహా ఫోటోలు సేకరించడం జరిగింది. నిర్ణీత గడువు లోగా సరైన డాక్యుమెంట్లు తీసుకురాకపోతే వెంటనే చర్యలు తీసుకుంటాం. అలాగే పట్టణంలో కబ్జాకు గురైన పదిశాతం, మున్సిపల్ స్థలాలపై కూడా సమగ్ర వివరాలు తెలుసుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– శంకర్‌సింగ్, మున్సిపల్ కమిషనర్

జిల్లా నడిబొడ్డున స్థలంపై వివాదం

అయితే, గతంలో గద్వాల మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన ఓ నాయకుడు విక్రయించిన స్థలం వివాదాస్పదంగా మారింది. పట్టణ మెయిన్ బజారులోని తేర్లవద్ద 1984లో తనతండ్రి కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ ఆధారంగా సంక్రమించిన ఓ దుకాణం, దాని పక్కనున్న కొంత స్థలాన్ని ఓ వ్యాపారికి సుమారు రూ.2.50కోట్లకు విక్రయించారు. దీంతో కొనుగోలు చేసిన సదరు వ్యక్తి ఆ స్థలంలో షాపు నిర్మాణ పనులు చేపట్టాడు. ఈ నిర్మాణం పనులపై పట్టణంలో పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తాయి. సోషల్‌మీడియాలో సైతం ఈ వార్తలు చక్కర్లు కొట్టాయి. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ శంకర్‌సింగ్ నిర్మాణం చేపట్టిన సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చారు. వారంలోగా పూర్తి డాక్యుమెంట్లు తీసుకురావాలని గడువు విధించారు. అప్పటి వరకు పనులు ఆపేయాలని పేర్కొన్నారు. ఇవేవి పట్టించుకోని సదరు వ్యక్తి పనులను కొనసాగిస్తుండడం గమనార్హం. వాస్తవానికి స్థలం విక్రయించిన సదరు మాజీ మున్సిపల్ చైర్మన్ 1984లో తండ్రి కొనుగోలు చేసిన ఒరిజినల్ డాక్యుమెంటును బయట పెడితే ఈ స్థలం వ్యవహారంలో అసలు విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. మరి సదరు నాయకుడు ఒరిజినల్ డాక్యుమెంట్ చూపెడతారా..? లేదంటే గోల్‌మాల్ చేస్తారా..? అన్నది వేచిచూడాలి.

కబ్జాకు గురైన కొన్ని స్థలాల వివరాలిలా..

⇨ జిల్లా కేంద్రంలోని కుంటవీధిలో రూ.కోట్ల విలువైన స్థలంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు కబ్జాచేసి ఏకంగా డూప్లెక్స్ ఇళ్లు నిర్మిస్తున్నాడు. దీనిపై మీడియాలో కథనాలు రావడమే కాకుండా సదరు వార్డు కౌన్సిలర్ సైతం అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ప్రస్తుత లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి సరిపెట్టారు. ప్రస్తుతం నిర్మాణం తుదిదశలో ఆగింది.

⇨ బీరెల్లి చౌరస్తాలో రూ.కోట్ల విలువ చేసే స్థలంలో అక్రమంగా షాపింగ్ నిర్మాణం చేపట్టగా అక్కడ కూడా నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులిపేసుకున్నారు.

⇨ సుంకులమెట్టు కాలనీలో సామూహిక మరుగుదొడ్లకు కేటాయించిన కోట్ల విలువ చేసే స్థలాన్ని ఓ ప్రైవేటు వైద్యశాల యజమాని కబ్జాచేసి అక్రమంగా నిర్మాణం చేపడితే అధికారులు మాత్రం పట్టింపులేనట్టుగా వ్యవహరిస్తున్నారు.

⇨ కొత్తహౌసింగ్ బోర్డుకాలనీలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సర్వే నంబర్ 789లో ప్రజా అవసరాల కోసం ఖాళీ స్థలంతో పాటు రోడ్డును దౌర్జన్యంగా ఆక్రమించి ప్లాట్లు చేశారు. దీనిపై స్థానిక కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాచేసిన వారిని ప్రశ్నించారు. అయితే రోడ్డును వేచిచోట ఇస్తామంటూ బెదిరింపులకు పాల్పడడంతో కాలనీవాసులు మిన్నకుండిపోయారు. ఇదిలాఉండగా, తాజాగా వివాదాస్పదంగా మారిన స్థలం నేపథ్యంలో సదరు మాజీ మున్సిపల్ చైర్మన్ ఒరిజినల్ డాక్యుమెంట్ బయటకు తెస్తారా..? లేక ఇది కూడా గతంలో మాదిరి నోటీసులకే పరిమితమవుతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగినందున ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడిన ఆయన అనంతరం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగినందున ప్రజలందరు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ బారిన వారికి వెంటనే తగిన చికిత్స అందించేలా బస్తీదవాఖానాలు, అర్బన్ హెల్త్‌సెంటర్లలో అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని ప్రజలకు సూచించేలా చర్యలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌళిక వసతులకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేసి పాఠశాలలు పునఃప్రారంభ సమయానికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు, మిషన్‌భగీరథ సీఈ చిన్నారెడ్డి, ఈఈలు శ్రీధర్‌రెడ్డి, భీమేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శశికళ, డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, డీపీవో వెంకట్‌రెడ్డి, డీఈవో ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఉమిత్యాలలో వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

కేటీదొడ్డి: వరి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేలు పరిహారం అందించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉమిత్యాల గ్రామ శివారులో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఏ రోజు కూడా రైతుల గురించి ఆలోచన చేయలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉంది, పంటలకు సమృద్ధిగా నీటి వసతులు ఉన్నాయా, విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఏనాడు కూడా మంత్రులతో గాని అధికారులతో చర్చించలేదని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ఇతర పార్టీల నాయకులను ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే పనిలోనే పడ్డారన్నారు. గతంలో కేసీఆర్ పాలనలో నీటి ఇబ్బంది ఉంటే కర్ణాటక నుంచి నీటిని ఐదు టీఎంసీల వరకు తీసుకోవడం జరిగిందని, మీరు కూడా వెంటనే కర్ణాటక రాష్ట్రంలో కూడా మీ పార్టీ అధికారంలో ఉందని, అక్కడి సీఎంతో మాట్లాడి వెంటనే ఐదు టీఎంసీల నీటిని పంపింగ్ చేసుకుని రైతులకు పొలాలకు సాగునీరు అందించే విధంగా ప్రయత్నించాలన్నారు. అధికారులను గ్రామాలకు పంపి పంటలపై పూర్తి సమగ్ర వివరాలు తెలుసుకుని ఎండిన వరి పంటలకు వెంటనే ప్రతి ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, నాయకులు చక్రదర్, హనుమంతు, గోవిందు, గోపి, రాజేష్, యుగందర్, వెంకన్‌గౌడు, కృష్ణ, జానీ, తదితరులు ఉన్నారు.

ఈవీఎంలపై సంపూర్ణ అవగాహన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్

గద్వాల రూరల్: పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఎంఏఎల్‌డీ డిగ్రీ కాలేజీలో ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర అన్నారు. ఇందుకోసం ఎన్నికల నిర్వాహణ మొదలు, పోలింగ్‌లో వినియోగించే ఈవీఎం యంత్రాల పనితీరుపై కూడా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 6గంటలకు మాక్‌పోల్ నిర్వహించాలని సూచించారు. పోస్టల్‌బ్యాలెట్ కోసం ఎన్నికల విధులలో పాల్గొనే ప్రతిఒక్కరు ఫారం–12 అందజేయాలన్నారు. ఈసందర్భంగా ఆయన పీవోలకు మాస్టర్ ట్రైనర్‌తో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ప్రమాణం చేసేందుకు సిద్ధమా..?



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: బీజేపీ నాయకురాలు డీకే అరుణ.. అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికంగా బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వలేదని నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ అమ్మవారు, బీచుపల్లి ఆంజనేయస్వామి సాక్షిగా ప్రమాణం చేసేందుకు సిద్ధమా అని జెడ్పీ చైర్పర్సన్ సరిత ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకర్లతో ఆమె మాట్లాడారు. డీకే అరుణ తన సొంత నియోజకవర్గంలో తాను నిలబెట్టిన బీసీ అభ్యర్థికి 7వేల ఓట్లు వచ్చాయని, అలాంటిది మహబూబ్‌నగర్‌లో ఎంపీగా తాను గెలవడం సాధ్యమేనా అని ఈ విషయాన్ని ప్రధాని మోదీ గుర్తించాలన్నారు. ఆమె గద్వాలలో ఓడిపోతాననే భయానికి బీసీలు గుర్తుకొచ్చారని, మరి ఎంపీ సీటు కూడా బీసీలకు ఇప్పించవచ్చు కదా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో ప్రతి బీసీ ఇంటికి వెళ్లి చైతన్యం చేస్తానన్నారు. ఇక వాల్మీకులను సీఎం అవమానించారనేది అవాస్తవమని, వెంటనే సీఎంకు డీకే అరుణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, గద్వాల ఎమ్మెల్యేకు ఇన్ని రోజులకు రైతులు గుర్తుకొచ్చారా అని, కాంగ్రెస్ వల్లే పంట నష్టపోయారని బురదజల్లే ప్రయత్నం చేయడం తగదన్నారు. రాజకీయ లబ్ధి కోసం రైతులను వాడుకోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కౌన్సిలర్ మహేష్, నాయకులు మధుసూదన్ బాబు, నాగేందర్ యాదవ్, లక్ష్మణ్, భాస్కర్ యాదవ్, ఇసాక్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బూత్ స్థాయిలో బీఎల్‌ఏల పాత్ర కీలకం
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట/కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అచ్చంపేట ఏసీఆర్ గార్డెన్, కొల్లాపూర్ ఎస్‌ఎం గార్డెన్స్‌లో సోమవారం మూడు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ బూత్ లేవల్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎల్‌ఏల కృషి ఫలితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ మల్లురవి గెలుపునకు కీలక పాత్ర పోషించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ.. అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రజా ప్రభుత్వాలను కూల్చడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పంటలకు మద్దతు ధర కోసం ఢిల్లీలో ఆందోళన చేపట్టిన రైతులను కాల్చి చంపారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినా బీజేపీకి వేసినట్లే అని అన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు.

నిప్పుల కుంపటి

- ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- ఉమ్మడి జిల్లాలో 42.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- త్వరలోనే మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- బయటకు వెళ్లే జాగ్రత్తలు తప్పనిసరి



గద్వాలలో ఎండలకు తాళలేక తలపై స్కార్ఫులు వేసుకొని వెళ్తున్న మహిళలు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరులో భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటింది. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని ఉడిత్యాల, గద్వాల జిల్లా కేటీదొడ్డిలో 42.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయిపల్లిలో 42.2 డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. వనపర్తి జిల్లాలోని పాన్‌గల్, గోపాల్‌పేట, కొత్తకోట, పెబ్బేరు, చిన్నంబావి, ఆత్మకూరు మండలాలు, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, కోడేరు, కల్వకుర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలోని గండేడ్, అడ్డాకుల, బాలానగర్, జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి, గద్వాల, అలంపూర్, వడ్డేపల్లి, ధరూర్ మండలాల్లో సోమవారం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో కనీసం 41 నుంచి 44 వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది.

వాతావరణ శాఖ హెచ్చరిక

రోజురోజుకూ పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈ నెల 1 నుంచి 5 తేదీ వరకు ఉమ్మడి పాలమూరులోని వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఈ నేపథ్యంలో ప్రజలు ఎండ వేడిమికి వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా శిశువులు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఎక్కువ సేపు ఎండలో ఉండటం, వేడి గాలుల వల్ల వెంటనే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, అన్ని వయస్సుల వారికి వడదెబ్బ ముప్పు పొంచి ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

రెండు నెలల పాటు..

ఈ ఏడాది వేసవి ప్రారంభం మార్చిలోనే ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఏప్రిల్ మొదటి రోజునే ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు పెరిగి నిప్పుల కుంపటిని తలపించనుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, వేసవిలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేస్తోంది. ఎండ ప్రభావం ప్రధానంగా దినసరి కూలీలు, రైతులు, చిరువ్యాపారులు, ఆరుబయట పనిచేసే వారిపై తీవ్రంగా ఉండనుంది. ఎండలో బయటకు వెళ్లేవారు దాహం వేయకపోయినా తరచుగా నీరు, కొబ్బరినీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్‌ఎస్ వంటివి తీసుకోవాలని చెబుతున్నారు. ఎండ నుంచి రక్షణ కోసం గొడుగు, టోపీ ధరించాలని సూచిస్తున్నారు.



సోమవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

జిల్లా	మండలం	గ్రామం	డిగ్రీలు
మహబూబ్‌నగర్	బాలానగర్	ఉడిత్యాల	42.3
జోగుళాంబ గద్వాల	కేటీదొడ్డి	కేటీదొడ్డి	42.3
వనపర్తి	కొత్తకోట	కానాయిపల్లి	42.2
నాగర్‌కర్నూల్	కొల్లాపూర్	కొల్లాపూర్	42.1
వనపర్తి	పాన్‌గల్	పాన్‌గల్	41.8
నాగర్‌కర్నూల్	బిజినేపల్లి	బిజినేపల్లి	41.7
నాగర్‌కర్నూల్	కోడేరు	కోడేరు	41.4
మహబూబ్‌నగర్	గండేడ్	సల్కర్‌పేట్	41.4
నారాయణపేట	ధన్వాడ	ధన్వాడ	40.8

అత్యవసరమైతేనే బయటకు..



వేసవిలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానంగా చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దు. ఎండలో తిరగాల్సి వస్తే గొడుగు, టోపీ వినియోగించాలి. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

– ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్

వేరుశనగ క్వింటా రూ.6,660



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 849 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6660, కనిష్టం రూ.3699, సరాసరి రూ.5200 ధరలు పలికాయి. అలాగే, 449 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5679, కనిష్టం రూ.3369, సరాసరి రూ.5679 ధరలు వచ్చాయి. 27 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ. 8609, కనిష్టం రూ. 4109, సరాసరి రూ. 8526 ధరలు పలికాయి. 499 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2541, కనిష్టం రూ. 1859, సరాసరి ధర రూ. 2489 ధరలు వచ్చాయి.

సోనామసూరి క్వింటాల్ రూ.2,501

దేవరకద్ర మార్కెట్ యార్డులో వరి ధాన్యం సీజన్ ప్రారంభమైంది. సోమవారం దాదాపు 3 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,501, కనిష్టంగా రూ.2,009 పలికాయి. అలాగే హంస గరిష్టంగా రూ.1,789, కనిష్టంగా రూ.1,719, ఆముదాలు గరిష్టంగా రూ.5,734, కనిష్టంగా రూ.5,714 చొప్పున వచ్చాయి.

5న రౌండ్‌టేబుల్ సమావేశం

పాలమూరు: ఎలక్టోరల్ బాండ్స్ విధానం–సుప్రీంకోర్టు తీర్పు, పర్యావసనాలపై శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రౌండ్‌టేబుల్ సమావేశం రెండు సెషన్స్‌గా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ అధ్యక్షతన కొనసాగుతుందని, ప్రముఖ వక్తలు హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి జిల్లా నుంచి మేధావులు, ప్రజాస్వామికవాదులు తరలిరావాలని కోరారు.


తన అనుభవాలాను వెల్లడిస్తున్న మంజుల (ఫైల్)

■ ఈమె పేరు మంజుల. డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి. డిగ్రీ పూర్తయిన తర్వాత తల్లిదండ్రులు వివాహం చేశారు. పండంటి బిడ్డకు సైతం జన్మనిచ్చింది. అయినప్పటికి భర్త, అత్తమామల ప్రోత్సాహంతో కళాశాలలో మహిళాసాధికారత విభాగం ఆధ్వర్యంలో ఇస్తున్న సర్టిఫికెట్ బ్యూటీషియన్ కోర్సులో చేరి శిక్షణ పొందింది. ఆర్థిక స్వావలంబన కోసం బ్యూటిషియన్ కోర్సు చేసినట్లు ఆమె చెబుతుంది. ఇలా కళాశాలలో విద్యను అభ్యసించే వారితోపాటు పూర్వ విద్యార్థులు, మహిళలు ఎవరికైనా కోర్సులో శిక్షణ పొందే వెసులుబాటు కల్పిస్తున్నారు.

సత్ఫలితాలిస్తున్న 'మహిళా సాధికారత'

డిగ్రీ కళాశాలలో ప్రత్యేకతగా నిలుస్తున్న చైల్డ్‌కేర్ సెంటర్

- స్వయం ఉపాధి కల్పించే దిశగా సర్టిఫికెట్ కోర్సులు
- భవిష్యత్‌లో ఎలక్ట్రానిక్, మొబైల్ రిపేర్ శిక్షణ

జడ్చర్ల టౌన్: యూజీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రారంభించిన మహిళా సాధికారత విభాగం పట్టణంలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంపూర్ణ ఫలితాలు సాధిస్తుంది. విద్యార్థులలో మానసిక పరివర్తన, లింగ వివక్షత లేని సమాజ నిర్మాణం, ఆత్మస్థైర్యం పెంపొందించటం, స్వీయరక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చటం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవటం వంటి ఆశయాలతో ఈ విభాగం ప్రారంభించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేనివిధంగా చైల్డ్‌కేర్ సెంటర్‌కు ప్రత్యేక గది కేటాయించటం గమనార్హం. తెలుగు అధ్యాపకురాలు సుభాషిణి నేతృత్వంలో ఆరేళ్లుగా ఈ విభాగం పూర్తిస్థాయిలో ఆశించిన ఫలితాలు వస్తున్నాయి.


చైల్డ్‌కేర్ సెంటర్‌లో తల్లులు పరీక్షకు వెళ్లగా పిల్లలను ఆడిస్తున్న కుటుంబసభ్యులు


బ్యూటిషియన్ కోర్సులో ఫేషియల్ శిక్షణ

చైల్డ్‌కేర్ సెంటర్..

కళాశాలకు వచ్చే విద్యార్థుల కుటుంబసభ్యులు, పరీక్షల సమయంలో వివాహమైన అభ్యర్థుల పిల్లలకు పాలిచ్చేందుకు, తల్లులు పరీక్షలకు వెళితే పిల్లలు ఆడించటానికి చైల్డ్‌కేర్‌సెంటర్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి సదుపాయం లేదంటే అతిశయోక్తి కాదు. రెండు పడకలతోపాటు చిన్నపిల్లల ఆటవస్తువులు ఇందులో ఉంచారు. పసి పిల్లలు ఉన్నట్లయితే వారు ఆడుకోటానికి ఆట వస్తువులు ఉంచారు. పిల్లలకు అవసరమైతే దుస్తులు మార్చేలా కొన్ని దుస్తులను సైతం అందుబాటులో ఉంచారు.

సెమినార్లు, వర్క్‌షాప్‌లతో అవగాహన..

జాతీయ, రాష్ట్ర, ప్రాంత సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ మహిళల హక్కులు, బాధ్యతలు, వారికి ఉన్న చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ న్యాయవాదులను పిలిపించి చట్టాలపై వివరిస్తున్నారు. నెలసరి, ఆహార సమస్యలు, వ్యాక్సినేషన్‌పైనా సలహాలు, సూచనలు ఇవ్వటం, సందేహాలు నివృత్తి చేస్తున్నారు. లింగ వివక్షత, సమానత్వం, వేధింపులు వంటివాటిపై ఉదాహరణలో చైతన్యం తీసుకువస్తున్నారు. మానవ అక్రమ రవాణపై (ట్రాఫికింగ్) తెలియజేసి జాగ్రత్తలను వివరింపజేస్తున్నారు.

భవిష్యత్ లక్ష్యాలు..

మహిళాసాధికారత విభాగం భవిష్యత్‌లో కొన్ని లక్ష్యాలు ఎంచుకుంది. వాటిలో మొబైల్ రిపేర్, ఎలక్ట్రానిక్ వస్తు మరమ్మతుపై శిక్షణ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. కళాశాల కమిషనర్‌ను సంప్రదించి పర్యావరణహిత కప్పుల తయారీ కేంద్రం ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనే లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థినుల తల్లిదండ్రులకు అండగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయి.

స్వయం ఉపాధికి సర్టిఫికెట్ కోర్సులు

మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బ్యూటీషియన్ (3నెలలు), మెహిందీ డిజైన్ (15రోజులు), టైలరింగ్ (2నెలలు) సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బ్యూటీషియన్ కోర్సు శిక్షణ పొందిన విద్యార్థినులు తమ బంధువుల ఇళ్లల్లో వేడుకలు అయితే తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కొందరు అమ్మాయిలు బ్యూటీపార్లర్‌లలో పనిచేస్తున్నారు. టైలరింగ్‌లోనూ నైపుణ్యం ఉన్న వారు సమయం ఉన్నప్పుడల్లా డిజైనింగ్ డ్రెస్సులు కుడుతూ తమకు అవసరమైన డబ్బులను సమకూర్చుకుంటున్నారు. ముఖ్యంగా ముస్లింలు మహిళలు మెహిందీ డిజైన్ కోర్సుపై ఆసక్తి చూపుతున్నారు. ఇటీవలే సెల్ఫ్‌డిఫెన్స్ కోర్సు కరాటే నేర్పిస్తున్నారు. అలాగే కర్రసాములోనూ తర్ఫీదునిస్తున్నారు.

బాలసదన్ వల్ల ఎలాంటి భయం లేకుండా..



నెలన్నర పసికందుతో పరీక్షకు వచ్చాను. కళాశాలలో చైల్డ్ కేర్ సెంటర్ ఉందని తెలియగానే ఎలాంటి భయం లేకుండా అమ్మతో పాపను ఉంచి పాలుపట్టించి పరీక్ష రాసేందుకు వెళ్లాను. పరీక్ష పూర్తయ్యే వరకు పాపతో అమ్మ చైల్డ్‌కేర్‌సెంటర్‌లో ఉంది. సాధారణంగా వేరే చోట అయితే ఇలాంటి సౌకర్యం ఉండదు.

– దివ్యభారతి, బీపెడ్ విద్యార్థిని, పోచమ్మగడ్డతండా

బ్యూటీషియన్ కోర్సు చేశా..



కాలేజీలో మహిళాసాధికారత విభాగం ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు చేసినందుకు నాకు చిన్న చిన్న ఆర్థిక అవసరాలు తీరుతున్నాయి. బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తూ సంపాదించుకోగలుగుతున్నాను. భవిష్యత్‌లోనూ ఆర్థికంగా నిలదొక్కుకుంటాననే భరోసా కలిగింది. చదువుతో పాటు ఇలాంటి కోర్సుల ద్వారా నాలాంటి పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం.

– శైలజ, నాన్‌చెరువుతండా, డిగ్రీ విద్యార్థిని

టైలరింగ్ నేర్చుకున్నా..



డిగ్రీ చదువుతూనే జువాలజీ అధ్యాపకురాలు సుభాషిణి, మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ కోర్సులో చేరి నేర్చుకున్నాను. ఇప్పుడైతే ఇంట్లో వాళ్ల దుస్తులన్నీ కుడుతున్నాను. దీనివల్ల పండుగలు, శుభకార్యాలప్పుడు సమయం ఆదా అవటంతోపాటు వ్యయం తగ్గింది. భవిష్యత్‌లో అవసరమైతే టైలరింగ్ రంగంలోనే రాణించి పలువురికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తాను.

– నవనీత, విద్యార్థిని, చొక్కంపేట

సఫలమయ్యాం..



మహిళా సాధికారత విభాగం లక్ష్యాలను ఆచరణలో పెట్టాలనే ఆరేళ్లుగా చేస్తున్న కృషిలో సఫలం అవుతున్నాం. స్వయం ఉపాధి మార్గాలను కల్పించటంతోపాటు సమాజంలో అన్ని రంగాల్లోనూ అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా లింగ వివక్షత, ట్రాఫికింగ్ వంటి వాటిపై చైతన్యం చేస్తున్నాం. పరీక్షలకు వచ్చే మహిళల పిల్లలకు పాలివ్వటం, వారి పేరెంట్స్‌తో ఉండేలా చైల్డ్‌కేర్‌సెంటర్‌ను ఏర్పాటు చేశాం.

– సుభాషిణి, మహిళాసాధికారత విభాగం కన్వీనర్

అందరి సహకారంతో..



అధ్యాపకులు, విద్యార్థుల సహకారంతో మహిళా సాధికారత విభాగం నిర్వహిస్తున్నాం. సర్టిఫికెట్ కోర్సులతోపాటు వ్యక్తిత్వ వికాసం పెంపు, చట్టాలు, హక్కులపై అవగాహనలు కల్పిస్తున్నాం. సమాజంలో వచ్చే మార్పులను తెలియజేస్తూ స్వయం ఉపాధి కల్పించుకునేలా మానసికంగా దృఢంగా మారుస్తున్నాం.

– డా.అప్పియాచిన్నమ్మ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కృష్ణానదిలో గ్రేటర్ ఫ్లెమింగో పక్షి



నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట వద్ద మత్స్యకారుడికి సోమవారం ఉదయం కృష్ణానదిలో గ్రేటర్ ఫ్లెమింగో(శాస్త్రీయ నామం ఫీనికాప్టెరస్ రోజియస్) అనే పక్షి చిక్కింది. పెంట్లవెల్లికి చెందిన మత్స్యకారుడు చిన్న కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లగా వలలో రెండున్నర అడుగుల ఈ పక్షి చిక్కుకుంది. ఉత్తర ఆఫ్రికా ఖండంలో నివసిస్తున్న ఈ పక్షులు గతంలో మన దేశానికి వలస వచ్చేవని, ప్రస్తుతం ఇక్కడే స్థిరపడ్డాయని జడ్చర్లలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ సదాశివయ్య తెలిపారు. ఇవి చాలా పెద్దగా ఉంటాయి కాబట్టి వీటిని గ్రేటర్ ఫ్లెమింగో అంటారన్నారు. ఫ్లెమింగో కుటుంబానికి చెందిన పక్షుల్లో ఇవే పెద్ద పక్షులని, సుమారు 60 ఏళ్ల వరకు జీవిస్తాయని చెప్పారు. బురద నీటిలో ఉన్న నీలి ఆకుపచ్చ శైవలాలు, వృక్ష ప్లవకాలు, చిన్నపాటి రొయ్యలు, నత్తల వంటి జీవులను ఆహారంగా తీసుకుంటాయని వివరించారు. ఇవి ఒకే ఒక్క గుడ్డును పెడతాయని పేర్కొన్నారు. అయితే ఈ పక్షిని ఇక్కడ ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదని మత్స్యకారుడు చిన్న చెప్పారు.

– పెంట్లవెల్లి

అక్రమ వెంచర్లపై చర్యలు చేపడుతాం



'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల: 'అడ్డగోలుగా వెంచర్లు' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే స్పందించారు. అక్రమ వెంచర్ల వ్యవహారంపై చర్యలు తీసుకునేందు సిద్ధంగా ఉన్నామని స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ వెంచర్ల ఏర్పాటుకు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంచర్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లు కాకుండా అధికారులను ఆదేశిస్తామన్నారు.

కేసీఆర్ తీరు హాస్యాస్పదం

- ప్రొఫెసర్ కోదండరాం


పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం

శాంతినగర్: ప్రకృతి సహకరించక, వర్షాలు లేక పంటలు ఎండిపోతుండగా.. రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ సీఎం కేసీఆర్ దుమ్మెత్తి పోయడం హాస్యాస్పదంగా ఉందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండలం జూలెకల్ పాఠశాల హెచ్ఎం రామ్మోహన్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎంతమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారని ప్రశ్నించారు. ఆయన తీరు సరిగా లేకనే ప్రజలు, నిరుద్యోగులు ఓటు ద్వారా సాగనంపారని అన్నారు. అధికారం కోల్పోయాక కేసీఆర్ పొలాలబాట పట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ సమాజంలో అసమానతలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కులమతాలకు అతీతంగా వ్యవహరిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, వడ్డేపల్లి జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ రజిత, ఉండవెల్లి వైస్ ఎంపీపీ దేవన్న, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఆలూరు ప్రకాష్‌గౌడ్, సీతారామిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల అదుపులో వేటగాళ్లు


నిందితులతో అటవీశాఖ సిబ్బంది

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం మన్ననూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అటవీశాఖ డిప్యూటీ రేంజర్ అధికారి రవి కుమార్ తెలిపారు. సోమవారం ఆరుగురు సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న క్రమంలో వ్యూ పాయింట్ సమీపంలో వన్య ప్రాణులను వేటాడేందుకు ఇద్దరు ఉచ్చులు బిగిస్తుండగా తారసపడినట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా రాత్లావత్ బీక్యా, రామావత్ బాల్యా బల్మూర్ మండలం బాణాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. వన్యప్రాణులకు ఉచ్చులు బిగించడంతో పాటూ అక్కడే విలువైన టేకు వృక్షాలను కూడా నరికి రవాణాకు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అక్కడి ఆధారాలను బట్టి తెలిసిందన్నారు. ఇద్దరిపై అటవీ సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరిస్తున్నట్లు డీఆర్ఓ తెలిపారు.

గుడిసె దగ్ధం

కోడేరు: విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని నాగులపల్లితండాకు చెందిన రాత్లావత్ చంద్ర గుడిసె ఏర్పాటు చేసుకొని జీవనం సాగించేవాడు. ఆదివారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో విద్యుదాఘాతంతో గుడిసెకు నిప్పంటుకొని దగ్ధమైంది. చుట్టుపక్కల వారు గుర్తించి మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. గుడిసెలో ఆరు కింటాళ్ల బియ్యం, దుస్తులు, రూ.10 వేల నగదు ఉన్నాయని.. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ జంబులయ్య ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

గోపాల్‌పేట: ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కోడేరు మండలం మైలారం చెందిన చిన్నస్వామి(37) ఆయన భార్య పుష్ప కలిసి మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా చిన్నస్వామికి ఆరోగ్యం బాగాలేదు. తాగుడుకు బానిసయ్యాడు. మార్చి 30న భార్య హైదరాబాద్ వెళ్లగా, సోమవారం చిన్నస్వామి ఇంట్లో ఉరేసుకున్నాడు. కాలనీవాసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి జంతువు దాడిలో దూడ మృతి

వెల్దండ: మండలంలోని కేస్లీతండాలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువులు దాడి చేయడంతో ఆవు దూడ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కేస్లీతండాకు చెందిన రైతు మెగావత్ బిక్యా చెందిన పాడి దూడను గుర్తు తెలియని అడవి జంతువులు దాడి చేయడంతో మృతి చెందింది. సోమవారం ఉదయం రైతు వ్యవసాయ పొలంలో ఉన్న పశువుల వద్దకు వెళ్లి చూసే సరికి పాడి దూడ మృతి చెందినట్లు గుర్తించారు. సంబంధిత ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో బీట్ ఆఫీసర్ లలిత ఘటనా స్థలానికి వెళ్లి చూశారు. దూడపై దాడి చేసిన ఘటనను పరిశీలిస్తే హైనా దాడి చేసి ఉండవచ్చని తెలిపారు. వేసవిలో పాడి దూడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల షెడ్ వద్ద మంటలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా రైతు కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రామన్‌పాడులో 1,011 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం రోజు రోజుకు తగ్గుతుంది. సోమవారం 1,011 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న వాహన తనిఖీలు


బాలానగర్‌లో పట్టుబడ్డ నగదుతో ఎస్ఐ తిరుప్పాజీ, సిబ్బంది

- పాలమూరు జిల్లాలో ఇప్పటి వరకు రూ.44 లక్షలు పట్టివేత

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలమూరు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.44,75,100 నగదు, 1,357.81 లీటర్ల మద్యం సీజ్ చేశారు. దీని విలువ రూ.4,82,848 ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 85 మద్యం కేసులు నమోదుకాగా.. 70 మందిని బైండోవర్ చేయగా, ఆరు తుపాకులు డిపాజిట్ అయ్యాయి.

బాలానగర్‌లో..

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టగా రూ.లక్ష నగదు పట్టుబడినట్లు ఎస్ఐ తిరుప్పాజీ తెలిపారు. వనపర్తి జిల్లా మండాపూర్‌కు చెందిన సంగనమోని శేఖర్ బొలెరో వాహనంలో హైదరాబాద్ నుంచి గ్రామానికి వెళ్తుండగా వాహన తనిఖీ చేశామని, రూ.లక్ష నగదు పట్టుబడిందని.. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద..

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద సోమవారం సాయంత్రం పోలీసుల తనిఖీల్లో నగదు పట్టుబడింది. రాజశేఖర్ అనే వ్యక్తి కారులో మంత్రాలయం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యంలో టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ ఎం.శ్రీనివాస్ వాహన తనిఖీలు చేపట్టగా రాజశేఖర్ కారులో రూ.65,500 నగదు పట్టుబడింది. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


చంద్రబండతండాలో బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పెద్దకొత్తపల్లి: చంద్రబండతండా, మారేడుమాందిన్నె తండాలపై నాగర్‌కర్నూల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని, 1800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ కల్యాణ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని బెల్టు దుకాణాలపై సోమవారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంకటస్వామి అనే వ్యక్తి నుంచి రూ. 6 వేలు విలువ చేసే 48 మద్యం బాటిళ్లను స్వాధీన చేసుకునట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.




మంటల్లో కాలిపోతున్న గన్ని బ్యాగులు


పరిస్థితిని అంచనా వేస్తున్న కలెక్టర్ తేజస్

గంటల తరబడి..

పెబ్బేరు మార్కెట్ గోదాంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం వల్ల గంటల తరబడి మంటలు చెలరేగాయి. సాయంత్రం నుంచి దాదాపు 7 గంటలకు పైగా ఏకధాటిగా అర్ధరాత్రి 12 గంటలు దాటినా మంటలు అదుపులోకి రాలేదు. పొక్లెయిన్ల సహాయంతో గోదలను బద్దలు కొట్టి.. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. గోదాంలో 13 లక్షల ఖాళీ గన్నీ బ్యాగ్‌లు ఉండడం.. మంటలు ఆర్పేందుకు ఫైరింజన్లకు నీళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల భారీ నష్టం వాటిల్లింది.

– పెబ్బేర్ రూరల్

బీజేపీ నియంత పాలనపై ఉద్యమిద్దాం

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్


మాట్లాడుతున్న ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీజేపీ నియంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆల్‌మేవా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో మతతత్వ రాజకీయాలతో ప్రజలను విడదీసే కుట్రకు తెరలేపారని ఆరోపించారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసిన రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టబోతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఆల్‌మేవా చేస్తున్న కృషిని అభినందించారు. సంఘానికి తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మాట్లాడుతూ.. సీఏఏతో దేశంలోని ముస్లిం మైనార్టీలను భయభ్రాంతులను గురి చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సీఏఏపై కేంద్రానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రంజాన్ నెల ప్రారంభ రాత్రి సీఏఏకు చట్టబద్ధత కల్పించి దేశవ్యాప్తంగా అమలుకు ఆదేశాలు జారీ చేసి ముస్లింలకు కానుకగా ఇచ్చిందని ఎద్దేవ చేశారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీ, మైనార్టీలు ఏకమై తమ హక్కుల సాధన, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో పదేళ్లుగా ముస్లింలకు ఉర్దూ ఘర్, షాదీఖానా ఏర్పాటు కోసం తమ సంఘం పోరాటం చేసిందని, ప్రస్తుతం మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇష్రత్‌అలీ, అయూబ్, వహీద్‌షా, రషీద్, హబీబ్ అబ్దురహెమాన్, షబ్బీర్, జహీర్ అఖ్తర్, యూసుఫ్ బిన్ నాసర్, అజ్మత్‌అలీ, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

అమ్రాబాద్: ఓ బాలికను ప్రలోభ పెట్టేందుకు యత్నిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పదర ఎస్ఐ రాజు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం పదరకు చెందిన ఓ బాలిక ఇంటి ముందు ఉండగా వినోద్ సైగలు చేస్తూ ప్రలోభ పెట్టేందుకు యత్నించాడు. దీంతో బాలిక యువకుడిని మందలించగా.. యువకుడు ఆమెపై దాడి చేశాడు. ఈ మేరకు మహిళ ఫిర్యాదు చేయగా పోక్సో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రాజు వివరించారు.